క్లుప్తంగా

త్యాగానికి ప్రతీక మొహర్రం


కాపు రామచంద్రా రెడ్డి, ప్రభుత్వ విప్

రాయదుర్గం: మొహర్రం త్యాగానికి, ధర్మ పరిరక్షణకు ప్రతీక అని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. మొహర్రం పండుగ సందర్భంగా విప్ కాపు తన సందేశాన్ని శనివారం విడుదల చేశారు. మహ్మద్ ప్రవక్త మనవడు హజ్రత్ ఇమామ్ హుస్సేన్ బలిదానానికి మొహర్రం ప్రతీకగా పేర్కొన్నారు. ఇస్లామిక్ క్యాలెండర్‌లో మొదటి నెల మొహర్రం అన్నారు. ఈ పవిత్ర సంతాప దినాలు నియోజకవర్గంలో మత సామరస్యానికి ప్రతిబింబంలా నిలుస్తాయన్నారు. హిందూ, ముస్లింల ఐక్యతను చాటే మొహర్రంను ప్రజలంతా శాంతియుతంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

మణిపూర్‌లో శాంతి నెలకొనాలి


టీ సర్కిల్‌లో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

కళ్యాణదుర్గం: మణిపూర్ రాష్ట్రంలో శాంతి నెలకొనాలని పట్టణంలో శనివారం క్రైస్తవులు శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక సీఅండ్‌ఐజీఎం చర్చి నుంచి టీ సర్కిల్ వరకూ వందలాది మంది క్రైస్తవులు క్రీస్తు శాంతిగీతాలను ఆలపిస్తూ ముందుకుసాగారు. అనంతరం కొరియన్ దేశస్తులు బైబిల్‌పై శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు చల్లా కిశోర్ చౌదరి, జిల్లా పాస్టర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డివారి నెహెమ్యా నాగరాజు, సువర్ణరాజు, స్వరూప్, పాస్టర్లు దేవరాజ్, జేమ్స్ నాయక్, చార్లెస్ నాయక్, జాన్‌పాల్, జాన్‌బాబు, రవి, చల్లా రాజశేఖర్‌చౌదరి పాల్గొన్నారు.

జైనబ్బీ ఉరుసు పోస్టర్ల విడుదల


పోస్టర్లు విడుదల చేస్తున్న దర్గా కమిటీ సభ్యులు

ఉరవకొండ: పట్టణంలోని పాక్‌దామన్ హజ్రత్ సయ్యదున్నిసా బీబీ జైనబ్బీ అమ్మవారి ఉరుసు పోస్టర్లను శనివారం భారీ భక్త జనసందోహం మధ్య ముస్లిం మత పెద్దలు, దర్గా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో విడుదల చేశారు. అనంతరం అమ్మవారి ఉరుసు ఉత్సవాల భారీ ఫ్లెక్సీను ఆవిష్కరించారు. అంతకు ముందు అమ్మవారి జీవసమాధి వద్ద దర్గా కమిటీ అధ్యక్షుడు హోతూరు బాషా, ఉపాధ్యక్షుడు బ్యాళ్ల ప్రసాద్, కార్యదర్శి జీఎంఎస్ షాకీర్, సహాయకార్యదర్శి ఖాదర్‌బాషా, కోశాధికారి జెండా జిలాన్, గౌరవ సలహా సభ్యులు పామిడిజాకీర్, బేల్దార్ శర్మాస్, వన్నూర్‌సాబ్, కమిటీ సభ్యులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడు మాట్లాడుతూ సెప్టెంబర్ 13 నుంచి 15వ తేదీ వరకూ నిర్వహించే ఉత్సవాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ మీరంబాషా, మోమిన్‌జిలాన్, అసోసియేట్ అధ్యక్షుడు వడ్లసలీం, టీమ్ మేనేజర్ ప్రతాప్‌రెడ్డి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

కమనీయం.. దేవదేవుడి దివ్య దర్శనం

అనంతపురం కల్చరల్: నగరవాసులు దేవదేవుడైన శ్రీనివాసుని దివ్య దర్శనంతో పులకించిపోయారు. శనివారం స్థానిక శ్రీసెవెన్ ఫంక్షన్ హాలులో సాయిట్రస్టు ఆధ్వర్యంలో తిరుమల నుంచి వచ్చిన అర్చకులు సుప్రభాత సేవ, అష్టాదళ పద్మార్చన, తిరుమంజనం, పుష్పయాగం, ఏడు శనివారాల వ్రతాలు, తిరుప్పాడ సేవ, తోమాలసేవలు నిర్వహించారు. 'వైకుంఠవాసుడి సేవలో ఒక రోజు' పేరిట నిర్వహించిన క్రతువు వైభవంగా సాగింది.

అంజన్నకు అభిషేకం


అలంకరణలో నేమకల్లు ఆంజినేయస్వామి

బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం అభిషేకం నిర్వహించారు. స్వామి మూలవిరాట్‌ను పట్టువస్త్రాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. ప్రధాన అర్చకుడు అనిల్‌కుమార్‌స్వామి ఆధ్వర్యంలో పురోహితులు వేకువజాము నుంచే స్వామికి కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకుపూజ, విశేష వెండి తమలపాకు అలంకరణ, అర్చనలు, అభిషేకాలు చేశారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

జలధికి తరలిన పీర్లు


కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలో పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం


ఉరవకొండ: భారీ భక్త జనసందోహం మధ్య జలధికి తరలివెళుతున్న లాల్‌స్వామి పీర్లు


కంబదూరులో పానకాలను తీసుకెళ్తున్న దృశ్యం

రాయయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరకొండ సాక్షి బృందం: మొహర్రం సందర్భంగా శనివారం పలు చోట్ల పీర్లను జలధికి తరలించారు. మరికొన్ని ప్రాంతాల్లో పెద్ద సరిగెత్తు ఘనంగా నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో పీర్లను ఆదివారం జలధికి తరలించనున్నారు. ఉరవకొండ పట్టణంతోపాటు ఆమిద్యాల, రాకెట్ల, కోనాపురం, బూదగవి, లత్తవరం, రాయంపల్లి, నెరమెట్ల, రేణుమాకులపల్లి, చిన్నముస్టూరు, మోపిడి తదితర గ్రామాల్లో పీర్లు భారీ ఊరేగింపు నడుమ జలధికి తరలివెళ్లాయి. అంతకుముందు భక్తులు పీర్లను దర్శించుకుని చక్కెర చదివించి మొక్కులు తీర్చుకున్నారు. కొందరు భక్తులు పిల్లల బరువుకు చక్కెర తులాభారం చేయించారు. అనంతరం పీర్లను తప్పెట్లు, మేళతాళాలతో ఘనంగా ఊరేగించి అగ్నిగుండం ప్రవేశం చేయించారు. అలాగే విడపనకల్లు మండలంలోని పాల్తూరు, గడేకల్లు, ఉండబండ, చీకలగురికి, గాజుల మల్లాపురం, విడపనకల్లు, డొనేకల్లు, వి.కొత్తకోట, ఆర్.కొట్టాల, పొలికి, హంచనహాల్ తదితర గ్రామాల్లో పీర్ల జలధి కార్య క్రమం ఘనంగా నిర్వహించారు. వజ్రకరూరు మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో పీర్లను జలధికి తీసుకెళ్లారు. అదేవిధంగా కణేకల్లుతోపాటు మండలంలోని వివిధ గ్రామాల్లో పీర్లదేవుళ్లను ఊరేగించి జలధికి తీసుకెళ్లారు. ఎస్.హనుమాపురం, మాల్యం, తుంబిగనూరు, పులచెర్ల, బ్రహ్మసముద్రం గ్రామాల్లో పీర్లదేవుళ్లను ఘనంగా ఊరేగించారు. కూడేరులో పానకాల ఉత్సవం నిర్వహించారు. బెళుగుప్ప మండలంలోని బెళుగుప్ప, రామసాగరం, అంకంపల్లి, దుద్దేకుంట, కాలువపల్లి, జీడిపల్లి, బూదివర్తి, ఆవులెన్న, ఎర్రగుడి, గంగవరం తదితర గ్రామాల్లో పెద్ద సరిగెత్తు కార్యక్రమంన్ని నిర్వహించారు.


వజ్రకరూరు: పీర్ల ఊరేగింపు దృశ్యం

భక్తిశ్రద్ధలతో పెద్ద సరిగెత్తు

రాయదుర్గం పట్టణంలోని పలు ప్రాంతాల్లో కొలువుదీరిన పీర్ల చావిళ్ల వద్ద శనివారం పెద్ద సరిగెత్తు(9వ రోజు) వేడుకలు కనుల పండువగా నిర్వహించారు. చావిళ్లను విద్యుత్ దీపాలతో అలంకరించారు. అగ్ని గుండాల(అలాయి) వద్ద రాత్రి అలాయ్ ఆడారు. పీర్లకు భక్తులు పానకాలు సమర్పించారు. ఆదివారం కోట ఊరువాకిలి వద్ద పీర్ల ఊరేగింపు(జలధి) నిర్వహిస్తున్నట్లు మజావర్లు తెలిపారు. అలాగే మండలంలోని వేపరాల, కెంచానపల్లి, కొండాపురం, గ్రామదట్ల, ఆవులదట్ల, జుంజురాంపల్లి గ్రామాల్లో పెద్దసరిగెత్తు వేడుకలు నిర్వహించారు. అగ్నిగుండం వెలిగించి, పీర్లను పూలమాలలతో అలంకరించి చావిడిలో కొలువుదీర్చారు. యువత రాత్రంతా అలాయ్ బలాయ్ ఆడారు. బొమ్మనహాళ్ మండలంలోని ఉద్దేహాళ్, బొమ్మనహాళ్, బండూరు, కొలగానహళ్లి, ఏళంజి, కానాపురం, దర్గాహొన్నూరు, కల్‌హోళ, తదితర గ్రామాల్లో పీర్ల పండుగను ఘనంగా నిర్వహించారు. అలాగే గుమ్మఘట్ట మండలంలోని కలుగోడు, భూపసముద్రం, బేలోడు, నేత్రపల్లి, గోనబావి, గొల్లపల్లిలో సరిగెత్తు ఉత్సవాలను నిర్వహించారు.

నేడు జలధికి పీర్లు

కళ్యాణదుర్గం పట్టణంతో పాటు మండల వ్యాప్తంగా శనివారం రాత్రి పీర్లను ప్రత్యేకంగా అలంకరించారు. పానకాల రోజు భక్తులు పానకం బిందెలతో పీర్లకు మొక్కులు తీర్చుకున్నారు. మొహర్రం సందర్భంగా ఎక్కడైనా అల్లర్లు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ బి.శ్రీనివాసులు హెచ్చరించారు. పండుగను అన్ని కులాల వారు సంతోషంగా జరుపుకోవాలని ఆయన సూచించారు. కంబదూరు మండల కేంద్రంలో పెద్ద సరిగెత్తు వేడుకలు ఘనంగా నిర్వహించారు. పీర్లమాల ధరించిన వారు కుటుంబ సభ్యులతో ఇళ్ల నుంచి పానకాలను ఊరేగింపుగా తీసుకెళ్లారు. కొంత మంది ట్రాక్టర్లు, ఎద్దుల బండ్లలో కట్టెలు, మొద్దులను తీసుకెళ్లి మకాన్ ఎదురుగా ఉన్న అగ్ని గుండంలోకి వేశారు. అలాగే బ్రహ్మసముద్రం మండలంలో మొహర్రం ఘనంగా నిర్వహించారు.


కంబదూరు: అగ్నిగుండంలోకి వేసేందుకు మొద్దు తీసుకెళ్తున్న దృశ్యం


ఉరవకొండ మండలం షేక్షానపల్లిలో పీర్లను జలధికి తీసుకెళ్తుతున్న దృశ్యం


విడపనకల్లు: ఉంబండలో పీర్ల ఊరేగింపు


కూడేరు: పీర్ల దేవుళ్లకు చక్కెర చదివింపులు చేస్తున్న ముజావార్ నిషార్


బెళుగుప్ప: పీర్ల వద్ద చక్కెర చదివిస్తున్న ముజావర్లు


బ్రహ్మసముద్రం మండలం ముప్పలకుంటలో కొలువుదీరిన పీర్లు


రాయదుర్గంటౌన్: పూజలందుకుంటున్న ఉచ్చుబాయి పీర్లు


రాయదుర్గం మండలం కెంచానపల్లిలో కొలువుదీరిన పీర్లు


బొమ్మనహాళ్ మండలం ఉద్దేహాళ్‌లో పీర్ల దర్శనం కోసం క్యూ కట్టిన భక్తులు


కణేకల్లు మెయిన్‌రోడ్డులో పీర్లదేవుళ్లను ఊరేగిస్తున్న దృశ్యం


కళ్యాణదుర్గంలో పీర్ల చావిడి వద్ద చిన్నారికి తులాభారం వేసి మొక్కు తీర్చుకుంటున్న దృశ్యం

ఘనంగా ఏకాదశి పూజలు


అలంకరణలో రుక్మిణీ పాండురంగస్వామి

బొమ్మనహాళ్: మండలంలోని ఉంతకల్లు రుక్మిణీ పాండురంగస్వామికి ఏకాదశి పూజలు వైభవంగా నిర్వహించారు. శనివారం తెల్లవారుజామున ప్రత్యేక జలంతో స్వామికి వేదమంత్రోచ్చారణల మధ్య అభిషేకం చేసి, మూలవిరాట్‌ను పట్టువస్త్రాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం స్వామికి కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకుపూజ మహామంగళహారతి వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా విఠల..విఠల రుక్మిణీ పాండురంగ విఠల అంటూ భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున తులసి మాలధారణకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున పోటెత్తారు.

హెచ్చెల్సీ యూటీ మరమ్మతు పూర్తి


మరమ్మతు చేస్తున్న దృశ్యం

కణేకల్లు: హెచ్చెల్సీ కాలువకు తుంబిగనూరు గ్రామశివారులో ఉన్న యూటీ (అండర్ టన్నల్)కు చేపట్టిన మరమ్మతులు పూర్తయ్యాయి. యూటీ స్లాబ్‌కు రంధ్రం పడడంతో .. గమనించిన కణేకల్లు హెచ్చెల్సీ సబ్ డివిజన్ అధికారులు యుద్ధప్రతిపాదికన మరమ్మతులు చేయించారు. కాంక్రీట్‌తో రెండు ఇంచుల ఎత్తుతో బెడ్డింగ్ వేశారు. హెచ్చెల్సీకి నీరు విడుదల చేయడంతో కణేకల్లు ప్రాంతానికి ఆదివారం రాత్రి నీరు వచ్చే అవకాశముండటంతో యూటీల వద్ద నీరు వృథా కాకుండా అధికారులు చర్యలు చేపట్టారు. కాంక్రీట్ బెడ్డింగ్ పనులు పూర్తి కావడంతో ఇక యూటీ వద్ద నీరు వృథా కాదని ఏఈఈ అల్తాఫ్ తెలిపారు.

'ప్రభుత్వాన్ని విమర్శించడం తగదు'

వజ్రకరూరు: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి విమర్శించడం తగదని వైఎస్సార్‌సీపీ రైతు వి భాగం రాష్ట్ర కార్యదర్శి కాకర్లనాగేశ్వరరావు అన్నారు. శనివారం వజ్రకరూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ప్రజాధనాన్ని ఇష్టమొచ్చినట్లు ఖర్చుపెట్టారని,అ ప్పుడెందుకు ప్రశ్నించలేదని ఆయన సూటిగా అడిగారు. నీరు–చెట్టు పేరుతో టీడీపీ నాయకులు రూ.వందల కోట్లు దోచుకుతిన్నారన్నారు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి రూపాయి ప్రజా సంక్షేమానికే ఖర్చు చేస్తోందన్నారు.

క్రీస్తు బాటలో నడుద్దాం


మాట్లాడుతున్న సిస్టర్ భువన

రాయదుర్గంటౌన్: క్రీస్తు చూపిన మార్గంలో ప్రతి స్త్రీ తన బాధ్యతను గుర్తించి కుటుంబంలో ప్రేమానురాగాలు పెంపొందించాలని ఉపన్యాసకులు, సిస్టర్ భువన సూచించారు. శనివారం పట్టణంలోని రాజీవ్ గాంధీకాలనీలో ఉన్న కింగ్ ఆఫ్ షాలేమ్ క్రైస్ట్ చర్చిలో శనివారం స్త్రీల ఆధ్యాత్మిక సదస్సు ఘనంగా నిర్వహించారు. పాస్టర్ కిరణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సదస్సులో సిస్టర్ భువన స్త్రీలకు బైబిల్ సందేశాలను వివరించారు. కౌన్సిలర్ శ్రీలక్ష్మి, చర్చి అభివృద్ధి మండలి సభ్యులు, 200 మంది మహిళలు పాల్గొన్నారు.

ఓటరు జాబితా వెరిఫికేషన్‌పై అప్రమత్తం


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ. చిత్రంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య

ఉరవకొండ: ఎన్నికలు సమీపిస్తున్న వేళ నియోజకవర్గంలో ఓటరు జాబితా వెరిఫికేషన్‌పై పార్టీ నాయకులు అప్రమత్తంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య సూచించారు. అనంతపురంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఉరవకొండ నియోజకవర్గానికి సంబంధించిన ఎంపీపీలు, జెడ్పీటీసీలు, జేసీఎస్ కన్వీనర్లు, ఇతర ముఖ్యనేతలతో సమావేశం నిర్వహించారు. విడపనకల్లు జెడ్పీటీసీ హనమంతు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ఓటరు వెరిఫికేషన్ సందర్భంగా దొంగ ఓట్లను తొలగించకుండా బీఎల్‌ఓలను టీడీపీ నాయకులు బ్లాక్‌మెయిల్ చేసే ప్రయత్నం చేస్తున్నారని, దీన్ని ప్రతి ఒక్కరూ అడ్డుకోవాలన్నారు. అలాగే కొత్త ఓటర్లను జాబితా చేర్పించాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు చేసిన మంచిని వివరించి, ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరాలని సూచించారు. 'జగనన్న సురక్ష' కార్యక్రమం నియోజకవర్గ వ్యాప్తంగా విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వీరన్న, కమ్మ, కురుబ, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్లు తేజోనాథ్, గోవిందు, దుద్దేకుంట రామాంజనేయులు, ఉరవకొండ జెడ్పీటీసీ పార్వతమ్మ, మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ లీకేజీ

శెట్టూరు: మండలంలోని చెర్లోపల్లి ప్రధాన రోడ్డుపై శ్రీరామిరెడ్డి తాగునీటి పైపులైన్ లీకేజీ అవుతోంది. శనివారం మధ్యాహ్నం రోడ్డుపై నీళ్లు బయటికి వచ్చి ఒకవైపు రోడ్డు మొత్తం ధ్వంసమైంది. దీంతో కళ్యాణదుర్గం, కుందుర్పి వెళ్లే వాహనాలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. చాలా సమయం వాహనాలు రోడ్డుపై నిలిచిపోయాయి. అనంతరం స్థానికులు అటుగా వస్తున్న నీటిని బంద్ చేయడంతో వాహనాలు ముందుకు సాగాయి.

'జగనన్న సురక్ష'తో చేరువైన పథకాలు

- అర్హులకు ధ్రువీకరణ పత్రాల జారీ
- ఆనందం వ్యక్తం చేస్తున్న పేదలు



ఈ ఫొటోలో కనిపిస్తున్న దంపతులు ఈరమ్మ, ఎర్రిస్వామి. రాయదుర్గం మండలం కదరంపల్లి గ్రామం. వీరు బొమ్మలాట తెగకు చెందిన వారు. ప్రభుత్వ రికార్డుల్లో బీసీలుగా పిలవబడినా, క్యాటగిరీ విభజనలో ఎటూ తేల్చకపోయారు. ఈ కారణంగా అనేక ఏళ్లుగా కుల ధ్రువీకరణ పత్రం పొందలేక సంక్షేమ పథకాలకు దూరంగా ఉన్నారు. ఎంతమంది అధికారుల చుట్టు తిరిగినా సమస్యకు పరిష్కారం లభించలేదు. వేసారి వదిలేశారు. చివరకు 'జగనన్న సురక్ష'లో దరఖాస్తు చేశారు. ప్రభుత్వ విప్ కాపు ప్రత్యేక చొరవతో పరిష్కారం లభించింది. బీసీ గా పరిగణిస్తూ వరికి ధ్రువీకరణ అందజేశారు. ఇలాంటి ఎన్నో దీర్ఘ కాల సమస్యలకు 'జగనన్న సురక్ష'లో పరిష్కారం చూపారు.


లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి (ఫైల్)

రాయదుర్గం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన 'జగనన్న' సురక్ష తో పేదలకు న్యాయం చేకూరింది. అర్హులకు ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు చేర్చుతూ పౌర సేవలకు పెద్దపీట వేసింది. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి అర్హులను గుర్తించారు. వారందరికీ పైసా ఖర్చు లేకుండా జనన, మరణ, కుల, ఆదాయం, సీసీ కార్డులు, రేషన్‌కార్డుల విభజన (స్ప్లిట్టింగ్) లాంటి 11 రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉండే వాటికి సైతం పరిష్కారం చూపారు. ఎలాంటి సర్వీసు చార్జీలు వసూళ్లు చేయకుండా సురక్ష క్యాంపుల్లో ఉచితంగా సర్టిఫికెట్లు అందజేశారు.

48,041 మందికి సేవలు'

డివిజన్‌లోని రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లో వివిధ పథకాలు, ధ్రువీకరణ పత్రాలు కోరుతూ 52,156 మంది సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వీరిలో 48,041 మందికి పరిష్కారం లభించగా, మిగిలిన 4,115 వివిధ కారణాలతో పరిశీలనలో పెట్టారు. ప్రజలు పెద్దఎత్తున ఈ క్యాంపుల్లో భాగస్వాములై సద్వినియోగం చేసుకున్నారు. సురక్ష లాంటి కార్యక్రమం మునుపెన్నడూ చూడలేదంటూ సేవలు పొందిన వారంతా ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నారు.

'సురక్ష' ద్వారా ప్రజలకు అందిన సేవలు

నియోజకవర్గం	రిజిస్ట్రేషన్‌అయినవి	పరిష్కారమైనవి
రాయదుర్గం	22,651	21,231
కళ్యాణదుర్గం	29,505	26,810

'సురక్ష' విజయవంతం

కళ్యాణదుర్గం డివిజన్ వ్యాప్తంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు పెద్దఎత్తున సద్వినియోగం చేసుకున్నారు. ప్రతి క్యాంపు ప్రజల భాగస్వామ్యంతోనే విజయవంతం చేశాం. ఇంకా అర్హులు ఎక్కడైనా మిగిలి ఉంటే జగనన్న సురక్ష పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. 48,041 మందికి 11 రకాల ధ్రువీకరణ పత్రాలతో పాటు పలు రకాల సంక్షేమ పథకాలు అందేలా కృషి చేశాం.

\- నిషాంత్‌రెడ్డి, ఆర్డీఓ, కళ్యాణదుర్గం

పేదల పక్షపాతి సీఎం జగన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతి. వారి సంక్షేమాభివృద్ధి కోసం ఈ నాలుగేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పలు సంస్కరణలు దేశానికే ఆదర్శంగా నిలిచాయి. టీడీపీ హయంలో పథకం ఏది కావాలన్నా నెలల తరబడి కాళ్లరిగేలా కార్యలయాల చుట్టూ తిరగల్సిన దుస్థితి. నాడు ఆపరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. సురక్ష కార్యక్రమం విజయవంతం చేసిన వారందరికీ కృతజ్ఞతలు.

\- కాపు రామచంద్రారెడ్డి, ప్రభుత్వ విప్

కూడేరులో 2,762 మందికి లబ్ధి

కూడేరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 'జగనన్న సురక్ష'లో మండల వ్యాప్తంగా 2762 మంది లబ్ధి పొందారు. కుల, ఆదాయ, జనన, మరణ, మ్యుటేషన్, ఇతర ధ్రువీకరణ పత్రాలను ఎలాంటి రుసుం లేకుండా ఉచితంగా లబ్ధిదారులకు అధికారులు అందజేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని అందరికీ సంక్షేమ పథకాలు అందాలన్న ఉద్దేశంతో అమలు చేసిన జగనన్న సురక్షతో తమకెంతో ప్రయోజనం జరిగిందని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కుటుంబ విభజన సర్టిఫికెట్ పొందాను: శర్మాస్ వలి,కూడేరు

ఏడాది క్రితం వివాహమైంది. రేషన్ కార్డు కోసం ఆరు నెలల క్రితం దరఖాస్తు చేసుకున్నా, కుటుంబ విభజన ప్రక్రియ చేయడానికి ఆప్షన్ లేక కొత్తగా రేషన్ కార్డు ఇవ్వలేదు. జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆ ఆప్షన్ పెట్టడంతో ఇంటింటా సర్వేలో దరఖాస్తు చేసుకున్నా. కుటుంబ విభజన సర్టిఫికెట్ అందింది.